క్లుప్తంగా

ఎం. కోటపాడు వీఆర్వోకు ఘన సన్మానం



వీఆర్వోను సన్మానిస్తున్న ఏఎంసీ చైర్మన్ కొండలరావు

మాడుగుల రూరల్: గణతంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టర్ నుంచి ఉత్తమ పురస్కారం పొందిన వీఆర్వో కె.శ్రీనివాసరావును మంగళవారం ఘనంగా సన్మానించారు. ఎం.కోటపాడు గ్రామ సచివాలయం వద్ద మాడుగుల ఏఎంసీ చైర్మన్ శానాపతి కొండలరావు ఆధ్వర్యంలో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. ఎం.కోటపాడు, ఎం.కె. వల్లాపురం ఉప సర్పంచ్‌లు శానాపతి గంగాధర్, కరణం రాము, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల్లో సౌకర్యాలు తప్పనిసరి



కొమిర బూత్‌లో ఏర్పాట్లపై సూచిస్తున్న ప్రమీలా గాంధీ

రావికమతం: మండలంలోని రావికమతం, చినపాచిల, కొమిర పోలింగ్ బూత్‌లను నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రమీలా గాంధీ మంగళవారం పరిశీలించారు. కొమిర బూత్‌లో అసౌకర్యంగా ఉన్న బాత్‌రూమ్‌ను, మరుగుదొడ్డిని బాగు చేయాలని తహసీల్దార్ మహేశ్వరరావును ఆమె ఆదేశించారు. దివ్యాంగులు బూత్ వద్దకు వెళ్లి ఓటు వేసేందుకు అనువుగా ఉండాలని, ర్యాంప్‌లపై చిన్న గుంతలను సైతం సరిచేయించాలని సూచించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను తేలిగ్గా తీసుకోవద్దని హెచ్చరించారు.

నియోజకవర్గ స్థాయి కబడ్డీ విజేత నర్సీపట్నం



జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన నర్సీపట్నం బాలుర కబడ్డీ జట్టు

నర్సీపట్నం: ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయి పురుషుల కబడ్డీ పోటీల్లో నర్సీపట్నం విజయం సాధించింది. టీమ్ సభ్యులు మజ్జి సాయి, వజ్రపు మదన్, మట్టం మణికంఠ, ఎస్ఎన్.బషీర్, గొలుసు శశికుమార్, రోహిత్, ముఖేష్, పండు, శివాజీ అద్భుతమైన ప్రతిభ కనబరిచారు. ఫైనల్‌లో నాతవరం, నర్సీపట్నం టీమ్‌లు హోరాహోరీగా తలపడ్డాయి. ఈ పోటీ లో నర్సీపట్నం టీమ్ విజయం సాధించింది. జిల్లా స్థాయిలో సత్తాచాటి రాష్ట్ర స్థాయికి అర్హత సాధిస్తామని టీమ్ సభ్యులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

చెత్తబుట్టల పంపిణీ



కార్యదర్శులకు చెత్తబుట్టలు అందిస్తున్న ఎంపీపీ

చీడికాడ: ప్రభుత్వం అందిస్తున్న చెత్తబుట్టలను వినియోగించుకుని గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీపీ కురచా జయమ్మ అన్నారు. మండలంలోని 23 పంచాయతీల్లో తడి, పొడి చెత్త సేకరణ కోసం 18,860 చెత్తబుట్టలు వచ్చాయి. ఈ మేరకు వీటిని మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద పంచాయతీ కార్యదర్శులకు ఆమె పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ లాలం శారదాజానకీరాం, ఎంపీడీవో జయప్రకాష్, వైస్ ఎంపీపీలు ధర్మిశెట్టి స్వాతి, కిముదు చిన్నమ్మలు, ఈవోపీఆర్డీ కామేశ్వరరావు పాల్గొన్నారు.

కుష్టు నిర్మూలకు సహకరించాలి



ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది

గొలుగొండ: కుష్టు వ్యాధి నిర్మూలనపై గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నామని వైద్యాధికారి శ్యామ్ తెలిపారు. దీనిపై గొలుగొండలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ గ్రామాల్లో కుష్టు లక్షణాలు కలిగిన వారు ఆందోళన చెందవద్దన్నారు. వైద్య సిబ్బంది సలహాలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బందితో పాటు అంగన్‌వాడీ, ఆశ సిబ్బంది పాల్గొన్నారు.

జాతిపిత సేవలు చిరస్మరణీయం



నర్సీపట్నం: గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి



మాకవరపాలెం: తామరంలో నివాళులర్పిస్తున్న హరిబాబు, తదితరులు



దేవరాపల్లి: గ్రంథాలయంలో గాంధీజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న లైబ్రేరియన్, పాఠకులు



బుచ్చెయ్యపేట: వడ్డాది జంక్షన్‌లో గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

- వాడవాడలా గాంధీజీ వర్ధంతి
- ఆ మహనీయునికి ఘన నివాళి



నాతవరం: గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఉపసర్పంచ్ అప్పలరాజు, ఉపాధ్యాయులు

నర్సీపట్నం: మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని కృష్ణాబజార్‌లోని గాంధీ విగ్రహానికి మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వాసవీ క్లబ్ సభ్యులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్య సాధనలో గాంధీ చేసిన పోరాటం, ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని చైర్‌పర్సన్ కొనియాడారు. కార్యక్రమంలో దేవత అరుణ, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

మాకవరపాలెం: గాంధీ వర్ధంతిని మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోనూ నిర్వహించారు. ఈ సందర్భంగా మాకవరపాలెం ఉన్నత పాఠశాలలో గాంధీ విగ్రహానికి ఎంఈవో పి.ఎస్.ఎన్.మూర్తి, తామరం సచివాలయం వద్ద గాంధీ విగ్రహానికి తూర్పుకాపు సంఘ మండలాధ్యక్షుడు గొంతిన హరిబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పంచాయతీ కార్యదర్శి బాలదొర, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దేవరాపల్లి: స్థానిక శాఖా గ్రంథాలయంలో జాతిపిత గాంధీజీ వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి గ్రంథపాలకుడు ఓ.శ్రీనివాసరావు ఘన నివాళులర్పించారు. సత్యాగ్రహమే ఆయుధంగా అహింస మార్గంలో పోరాడి యావత్ భారత జాతికి స్వేచ్ఛా స్వతంత్రాలు అందించిన మహనీయుడు మహాత్మ గాంధీ అని పాఠకులకు వివరించారు. కార్యక్రమంలో కె.మురళీ, కె. సన్యాసిరావు, ఎం. బాబూరావు పాల్గొన్నారు.

రోలుగుంట: గాంధీ వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుని విగ్రహాలకు పలువురు ఘన నివాళులర్పించారు. రోలుగుంటలో శాకా శ్రీను, కొండపాలెంలో బంటు వెంకటరమణ, కొవ్వూరులో సర్పంచ్ యర్రంశెట్టి కాంతమ్మ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్య సాధనలో అలుపెరగని పోరాటం చేశారని ఈ సందర్భంగా కొవ్వూరు సర్పంచ్ కాంతమ్మ కొనియాడారు.

బుచ్చెయ్యపేట: మండలంలో జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. వడ్డాది, బుచ్చెయ్యపేట, సీతయ్యపేట తదితర గ్రామాల్లో వాసవీ క్లబ్ సభ్యులతోపాటు పలువురు నాయకులు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బంగారుమెట్ట, కొమళ్లపూడి, ఆర్. భీమవరం, కొత్తూరు, మంగళాపురం, పేట, కందిపూడి తదితర గ్రామాల్లో గాంధీ విగ్రహాల వద్ద శ్రద్ధాంజలి ఘటించారు.

నాతవరం: దేశం కోసం గాంధీజీ చేసిన త్యాగాలను నేటి తరానికి చాటి చెప్పాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఉప సర్పంచ్ కరక అప్పలరాజు అన్నారు. ఈ సందర్భంగా నాతవరంలో గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పంచాయతీ కార్యదర్శి శ్రీను, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు సచివాలయ భవనాలు ప్రారంభం

బుచ్చెయ్యపేట: మండలంలో నాలుగు గ్రామాల్లో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలను ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ బుధవారం ప్రారంభిస్తారని పార్టీ మండలాధ్యక్షుడు జోగా కొండబాబు తెలిపారు. పెదమదీనలో గ్రామ సచివాలయ భవనం, హెల్త్ సెంటర్, పీపీ అగ్రహారంలో రైతు భరోసా కేంద్రం, మల్లాం, ఆర్. శివరాంపురం గ్రామాల్లో సచివాలయ భవనాలను ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొనాలన్నారు.

గ్రామ స్వరాజ్యాన్ని నెరవేర్చిన సీఎం జగన్



నిమ్మగెడ్డ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గణేష్

- నియోజకవర్గంలో రూ.5 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభం
- నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్



ఎం.బి.పట్నంలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్

నాతవరం: గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ ద్వారా నెరవేర్చారని ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ అన్నారు. మండలంలోని పెదగొలుగొండపేట, గుమ్మిడిగొండ, మన్యపురట్ల, ఎం.బి.పట్నం, మర్రిపాలెం పంచాయతీల్లో రూ. 3 కోట్లతో నిర్మించిన సచివాలయ, ఆర్బీకే, హెల్త్ క్లినిక్ నూతన భవనాల శిలాఫలకాలను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. వీటితోపాటు మన్యపురట్ల ఎస్సీ కాలనీలో నిర్మించిన కమ్యూనిటీ భవనం, మర్రిపాలెంలో సీసీ రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క రోజులోనే నర్సీపట్నం, నాతవరం, గొలుగొండ మండలాల్లో రూ.5 కోట్లతో నిర్మించిన నూతన భవనాలను ప్రారంభించడం చాలా ఆనందంగా ఉందన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు కావాల్సిన పనులు గ్రామంలోనే అందిస్తున్నామన్నారు. ఆర్బీకే, హెల్త్ క్లినిక్ నూతన భవనాల్లో రైతులకు రోగులకు కావలసిన సేవలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కరక అప్పలరాజు, పార్టీ మండలాధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు, గన్నవరం పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి గొర్లె వరహాలబాబు, కాపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ శిరుసుపల్లి నర్సింగరావు, పామాయిల్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టరు పైల పోతురాజు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శెట్టి నూకరాజు, సర్పంచులు మిరపల వెంకటరమణ, పంచాడ పాప, కొత్తలు తలుపులు, కాళ్ల ఝాన్సీరాణి, మంకు రమణమ్మ, ఎంపీటీసీ సభ్యులు తమరాన సత్యనారాయణ, సుర్ల అచ్చియ్యనాయుడు, ఉల్లంపర్తి జోత్స్న, పల్లి లక్ష్మణరావు, సచివాలయ మండల కన్వీనర్ అడిగర్ల నాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యులు ఉలబాల శ్రీను, మాకిరెడ్డి వెంకటరమణ, మంకు సాంబమూర్తి, వర్రే తాతబాబు, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం మండలాధ్యక్షురాలు కామిరెడ్డి లక్ష్మి, పంచాయతీ రాజ్ డీఈ ఈశ్వరరావు, ఎంపీడీవో హనుమంతరావు, వైద్యాధికారులు ప్రసన్న, ఎం.రాజేష్‌నాయుడు పాల్గొన్నారు.

గిరిజనులకు రోడ్డు సౌకర్యం

గొలుగొండ: పాతమల్లంపేట పంచాయతీ శివారు ఎన్. గదబపాలెం, ఎం. గదబపాలెం, నిమ్మగెడ్డ గిరిజన ప్రజలకు రోడ్డు సౌకర్యం కల్పించడం కోసం రూ.60 లక్షలు మంజూరు చేశామని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తెలిపారు. ఆయన మంగళవారం సాయంత్రం గొలుగొండ మండలంలో నిమ్మగెడ్డ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. కొత్తమల్లంపేట, జోగుంపేట, ఎర్రవరం గ్రామ సచివాలయాలను ప్రారంభించారు. కొత్తమల్లంపేటలో నూతన ఆర్బీకే శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్‌సీపీని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ గజ్జలపు మణికుమారి, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, పార్టీ మండలాధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షురాలు లోచల సుజాత, వైస్ ఎంపీపీ జక్కు నాగమణి, సర్పంచ్‌లు పోలిరెడ్డి రాజుబాబు, జువ్వల లక్ష్మి, పీ వరలక్ష్మి, ఎం ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం సీఎంకు రెండు కళ్లు

ఆర్బీకే, హెల్త్ సెంటర్, అంబేడ్కర్ విగ్రహాలను ప్రారంభించిన ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



తిమ్మన్నపాలెంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



ఖండిపల్లిలో ఆర్బీకేను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: అభివృద్ధి, సంక్షేమం సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రెండు కళ్లు అని, ఆయన పరిపాలన దేశానికే ఆదర్శమని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. లక్ష్మీపురంలో నూతనంగా నిర్మించిన హెల్త్ సెంటర్ భవనం, శివాలయం కాలనీలో కమ్యూనిటీ స్టేజ్ భవనాన్ని సర్పంచ్ శిరుచోళ్ల గంగాభవానీ గణపతినాయుడు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ధర్మశ్రీ మంగళవారం ప్రారంభించారు. తిమ్మన్నపాలెంలో సర్పంచ్ గొర్లె రాము ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఖండిపల్లిలో సర్పంచ్ శానాపతి రాజశేఖర్ ఆధ్వర్యంలో ఆర్బీకే భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విప్ ధర్మశ్రీ మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేనన్ని సంక్షేమ పథకాలు ప్రజలకు అమలు చేశారన్నారు. గ్రామ స్వరాజ్య స్థాపనకు గ్రామాల అభివృద్ధి కోసం అన్ని విధాలుగా ముఖ్యమంత్రి పని చేస్తున్నారన్నారు. కొత్తగా సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేయడంతోపాటు అన్ని భవనాలు నిర్మించడం, శాఖలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, సిబ్బందిని పూర్తిస్థాయిలో ఏర్పాటు చేశారన్నారు. ప్రజలకు సకాలంలో సేవలందించేలా తీర్చిదిద్దడంతో దేశంలో ఆదర్శంగా ఏపీ నిలిచిందన్నారు. రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ సెంటర్లు ఏర్పాటు చేయడం వల్ల గ్రామ స్థాయిలోనే అన్ని సౌకర్యాలు అందుతున్నాయన్నారు. అభివృద్ధితోపాటు ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో పూర్తిగా మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, ఎంపీపీ గాడి కాసు, పీఏసీఎస్ అధ్యక్షుడు శానాపతి సత్యారావు, వైస్ ఎంపీపీ బైన ఈశ్వరరావు, మండలాధ్యక్షుడు దొడ్డి వెంకట్రావు, మాజీ సర్పంచ్ గొర్లె శ్రీనివాసరావు, మాలమహానాడు ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

'సిద్ధం' సభతో వైఎస్సార్‌సీపీకి పెరిగిన ఆదరణ

- ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్

నాతవరం: సంగివలసలో సిద్ధం బహిరంగ సభ విజయవంతంతో ఉత్తరాంధ్రలో వైఎస్సార్‌సీపీకి ప్రజల నుంచి మరింత ఆదరణ పెరిగి టీడీపీ క్యాడర్‌లో వణుకు మొదలైందని ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ అన్నారు. మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన విలేకరులతో మాట్లాడారు. సిద్ధం బహిరంగ సభకు స్వచ్ఛందంగా లక్షలాది మంది రావడంతో వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో ఊహించని ఉత్సాహం కనిపిస్తుందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం హామీలు నెరవేర్చడంతో అన్ని వర్గాల ప్రజలు వైఎస్సార్‌సీపీని మరలా గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. టీడీపీ, జనసేన పార్టీ కూటమికి ఆదిలోనే హంసపాదు మాదిరిగా క్షేత్రస్థాయిలో ఛీదరించుకునే పరిస్థితి ఉందన్నారు. ఎన్ని పార్టీలు ఏకమైనా ఎంతమంది చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్‌లు వచ్చినా అంతిమ విజయం వైఎస్సార్‌సీపీదేనన్నారు. దీన్ని జీర్ణించుకోలేక ప్రతిపక్ష నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, వాటిని క్షేత్రస్థాయిలో తిప్పికొట్టాలన్నారు. ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, పార్టీ మండలాధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు, పార్టీ సీనియర్ నేత కరక అప్పలరాజు, కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్లు శిరుసుపల్లి నర్సింగరావు, పైల పోతురాజు, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఉలబాల శ్రీను, గుడపర్తి అచ్చియ్యనాయుడు, సర్పంచ్ మిరపల వెంకటరమణ, ఎంపీటీసీలు తమరాన సత్యనారాయణ, గాడి రమేష్ పాల్గొన్నారు.

హోరాహోరీగా ఎడ్లబళ్ల పరుగు పోటీలు



ఎడ్ల బళ్ల పందెంలో పరుగు తీస్తున్న గిత్తలు

మాడుగుల: జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పరుగు పోటీలు హోరాహోరీగా సాగాయి. మంగళవారం వాడపాడులో రాములోరి తీర్థం సందర్భంగా ఈ పోటీలు నిర్వహించారు. ముందుగా ఉదయం నుంచి గ్రామస్తులను సీతా రాములను దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో మహిళల కోలాటాల ప్రదర్శన ఆకట్టుకుంది.

వైభవంగా మరిడిమాంబ తీర్థ మహోత్సవం

కె.కోటపాడు: రొంగలినాయుడుపాలెంలో మరిడిమాంబ తీర్థమహోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇతర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున బంధువులు, స్నేహితుల రాకతో గ్రామంలో సందడి నెలకొంది. అమ్మవారికి జెడ్పీటీసీ ఈర్లె అనురాధ, సర్పంచ్ పైల పైడితల్లమ్మ, కోటేశ్వరరావు, ఎంపీటీసీ గొర్రుపోటు రామలక్ష్మి, యడ్ల వెంకటరావు తదితరులు పూజలు చేశారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



అమ్మవారికి పూజలు చేస్తున్న సర్పంచ్ పైడితల్లమ్మ

గ్రామాల్లో పూర్తిస్థాయిలో వైద్య సేవలు

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని పరిశీలించిన ఇన్‌చార్జి ఎంపీపీ రాజారామ్



మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్



రాజాంలో రోగులకు ఆరోగ్య సురక్ష కిట్లు అందిస్తున్న నాయకులు, వైద్యులు



వీరనారాయణంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు



దేవరాపల్లి: కొత్తపెంటలో రోగులను పరీక్షిస్తున్న గైనకాలజిస్టు రోజారాణి

మాడుగుల రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలతో గ్రామాల్లో వైద్య సేవలు పూర్తిస్థాయిలో అందుతున్నాయని ఇన్‌చార్జి ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ పేర్కొన్నారు. మంగళవారం వీరనారాయణంలో ఆరోగ్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. కె.జె.పురం పీహెచ్‌సీ వైద్యులు ప్రసాదు పాత్రుడు, లీలాప్రసాదు, ప్రత్యేక వైద్యులు నరేష్, రామ్‌కుమార్, ఆప్తాలమిక్ అసిస్టెంట్ పి. నాగలక్ష్మి 365 మంది రోగులను పరీక్షించారు. ఎంపీడీవో మీనాకుమారి, సర్పంచ్ యల్లపు కొండప్పారావు, ఎంపీటీసీ సభ్యురాలు దాడి నూకరత్నం, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి విస్సారావు రామారావు, కె.జె.పురం పీహెచ్‌సీ సీహెచ్‌వో పుష్పమ్మ పాల్గొన్నారు.


రాజాంలో 376 మందికి వైద్య సేవలు

బుచ్చెయ్యపేట: రాజాంలో ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. 376 మంది రోగులను వైద్యులు ఎల్. వినయ్‌కుమార్, అక్తర్, సంధ్యారాణి పరీక్షించి ఉచితంగా మందులు అందించారు. వీరిలో 24 మందికి ఆరోగ్య సమస్యలున్నట్లు గుర్తించి మెరుగైన వైద్య సేవలకు ఎంపిక చేశారు. జెడ్పీటీసీ దొండా రాంబాబు, సర్పంచ్ మరిసా నాని, నాయకులు మరిసా పెదరమణ, పడాల నాగభూషణం, ఎల్లపు విజయ్‌కుమార్, గొంపా అప్పారావు, ఈవోపీఆర్డీ విజయలక్ష్మి, వైద్య సిబ్బంది మౌళి పాల్గొన్నారు.

కొత్తపెంటలో 391 మందికి..

దేవరాపల్లి: కొత్తపెంటలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో గైనకాలజిస్టు రోజారాణి, జనరల్ డాక్టరు మహ్మద్ అమీర్, వేచలం పీహెచ్‌సీ వైద్యాధికారి బీ హారిక 391 మంది రోగులను పరీక్షించారు. ఉచితంగా మందులు అందజేశారు. వీరిలో 40 మందికి కంటి పరీక్షలు చేశారు. ముందుగా ఈ శిబిరాన్ని సర్పంచ్ రొంగలి వెంకటరావు ప్రారంభించారు.

మండల బడ్జెట్ ఆమోదం



మాట్లాడుతున్న ఎంపీపీ జయమ్మ

చీడికాడ: ఎంపీపీ కురచా జయమ్మ అధ్యక్షతన మంగళవారం సాయంత్రం మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా గ్రామాల అభివృద్ధికి సర్పంచ్‌లు,ఎంపిటిసిలు కృషి చెయ్యాలన్నారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు చొరవతో మండలంలోని రూ.27 కోట్లతో మారుమూల గ్రామాలకు తారురోడ్లు వేస్తున్నామన్నారు. అనంతరం 2024-25 వార్షిక అంచనా బడ్జెట్‌ను సమావేశంలో ప్రవేశపెట్టారు. 56 కోట్ల 98 లక్షల 88 వేల రూపాయల అంచనా బడ్జెట్ కాగా, వ్యయం 56 కోట్ల 08 లక్షల 82 వేల రూపాయలుగా, నిల్వ అంచనా బడ్జెట్ 88 లక్షల 06 వేల రూపాయలుగా ముగించి తీర్మానించారు. దీనికి సభ్యులు ఆమోదం తెలిపారు. సమావేశంలో జెడ్పీటీసీ లాలం శారదా వరలక్ష్మి, వైస్ ఎంపీపీలు ధర్మిశెట్టి స్వాతి, కిముదు చిన్నమ్మలు, ఎంపీడీవో జయప్రకాష్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

బోధన పద్ధతుల మెరుగుకు చర్యలు


- ఎంఈవో జానుప్రసాద్



బోధనా నిపుణులతో ఎంఈవో సమీక్ష

రోలుగుంట: పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని సబ్జెక్టుల్లోను మేలైన బోధన అందించేందుకు విద్యాశాఖ అవసరమైన చర్యలు చేపట్టిందని ఎంఈవో జానుప్రసాద్ తెలిపారు. అందుకుగాను ఏర్పాటైన లిప్ (అభ్యసన అభివృద్ధి కార్యక్రమం) టీముతో మంగళవారం ఆయన తన కార్యాలయంలో సమీక్షించారు. పి.వి.కనకరాజు(ఆంగ్లం), కె.ఎస్.ఎస్.ప్రసాద్ (సోషల్), టి.సత్యనారాయణ(తెలుగు), బి.కోటేశ్వర్రావు(గణితం), సిహెచ్.జయబాబు(పి.సైన్సు), దాడిశెట్టి రమేష్ కుమార్ (రిసోర్స్ పర్సన్) తదితరులతో పాఠశాలలో బోధన పద్ధతులు అమలుపై సబ్జెక్టుల వారీగా చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో అన్ని పాఠశాలలను ఈ టీము పర్యవేక్షించి, ఉపాధ్యాయుల బోధనాశైలి తెలుసుకుంటుందన్నారు. ఏ విధంగా విద్యార్థులకు మేలైన బోధన అందించాలి, వెనుకబడిన వారిని ఎలా చైతన్యపరచాలి, ఆశించిన ఫలితాలు ఎలా రాబట్టాలనే పలు విషయాలపై సూచనలు, సలహాలు ఇస్తుందని వివరించారు.

ఆర్టీసీ ఉద్యోగుల నిరసన



డిపో గేటు వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

నర్సీపట్నం: ఏపీ ప్రజా రవాణా సంస్థ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్స్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక డిపో అసోసియేషన్ సభ్యులు రెడ్ బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ కార్యదర్శి జి.ఎస్.నారాయణ మాట్లాడుతూ ఉద్యోగ భద్రత సర్కులర్ అమలు చేయాలన్నారు. కౌన్సెలింగ్ పద్ధతిలో కండక్టర్లు, డ్రైవర్లు చార్టులు వేయాలన్నారు. అన్ని కేటగిరీల్లో ఖాళీలను పదోన్నతులతో భర్తీ చేయాలన్నారు. ఉద్యోగుల అక్రమ బదిలీలు, ప్రతినిధులపై కక్షసాధింపు చర్యలు మానుకోవాలన్నారు. కార్యక్రమంలో రాజాన నూకరాజు, రమణ పాల్గొన్నారు.

ముగిసిన జంతు సంక్షేమ పక్షోత్సవాలు



మాట్లాడుతున్న పశువైద్యాధికారి మణిలక్ష్మణ్

మాడుగుల రూరల్: మండలంలో ఈ నెల 14వ తేదీ నుంచి నిర్వహిస్తున్న జంతు సంక్షేమ పక్షోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఇందులో భాగంగా కె.జె.పురం జెడ్పీ హైస్కూలు విద్యార్థులకు జంతు సంరక్షణ చట్టాలు గురించి అవగాహన కల్పించారు. కె.జె.పురం పశువైద్యాధికారి పి. మణిలక్ష్మణ్ మాట్లాడుతూ జంతు సంరక్షణకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయన్నారు. ఆవాసం లేని జంతువులను వధించకూడదని, ఎటువంటి హాని కలిగించకూడదని, ఎటువంటి విష ఆహారం పెట్టకూడదని సూచించారు. ఇటువంటి చర్యలకు ఎవరైనా పాల్పడితే వెంటనే తెలియజేయాలని సూచించారు. అనంతరం జంతు సంక్షేమ పక్షోత్సవాలు గురించి క్విజ్ పోటీలు నిర్వహించారు. మొదటి ముగ్గురు విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఖండివరం పశువైద్యాధికారి గణేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.